


# నవభూమి వరంగల్

అనుబంధం

02 ఏప్రిల్,2025 బుధవారం పేజీలు:3

www.epaper.navabhoomi.in


### విశ్వవిద్యాలయాల భూముల పరిరక్షణ

# బాధ్యత ప్రభుత్వాలదే

- యువైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు అక్కల బాపు
- తెలంగాణ ప్రజా ఫ్రంట్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్



**భూపాలపల్లి,ఏప్రిల్ 1 నవభూమి ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మలహాల్ రావు మండలంలో మంగళవారం రోజున తెలంగాణ ప్రజా ఫ్రంట్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్ పత్రిక విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ..పాలక ప్రభుత్వాల పనితీరు చూస్తుంటే కంచే చేను మేసిన చందంగా మారిందని,ఆరు దశాబ్దాల ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ ఆకాంక్షలు మా భూములు,మా నీళ్లు మా ఉద్యోగాలు,మా నిధులు మావే అనే ఈ ఉద్యమాలకు ఊపిరి ఊదింది విద్యార్థులే అని అన్నారు.కేవలం తెలంగాణకే పరిమితం కాదు, యావత్ భారతదేశంలో ప్రజాస్వామిక ఉద్యమా లన్నింటికి తోడుగా నిలిచింది ప్రభుత్వ విశ్వ విద్యాలయాలే అని,ప్రశ్నించే గొంతుకలను నిలువరించేందుకే పాలక ప్రభుత్వాలు విద్యా సంస్థల, యూనివర్సిటీలను ప్రైవేటీకరణ వైపు మొగ్గు చూపడం బాధాకరం అని పేర్కొన్నారు. అందులో భాగంగానే యూనివర్సిటీ భూముల అమ్మకాలు/ పరాయీకరణ.తాజాగా హైదరాబాదు లోని కేంద్రీయ విశ్వ విద్యాలయంకు చెందిన 400 ఎకరాల భూమిని టీజీఐఐసి కి రాష్ట్ర ప్రభుత్వం కట్టబెట్టిందన్నారు.దీనిని నిరసిస్తూ ఉద్యమించిన విద్యార్థిని,విద్యార్థులపై దాడి చేయడం,అక్రమంగా నిర్భందించడం నిత్య కృత్య మైంది అని అన్నారు.కేంద్రీయ విశ్వవిద్యాలయ విద్యార్థుల నిరసనకు,ఉస్మానియా విద్యార్థులు గొంతు కలిపారని,జై తెలంగాణ ఉద్యమం 1969 నుండి ఉవ్వెత్తున ఎగిసి పడిందని,తెలంగాణ ఉద్యమాన్ని నీరుగార్చేందుకు,ఆరు సూత్రాల పథకంలో భాగంగా,ఉపశమనం కోసం 1974లో నాటి ప్రధాని ఇందిరా గాంధీ హైదరాబాద్ లోని కంచె గచ్చిబౌలి లో 2300 ఎకరాల భూమిని ( సర్వే నెంబర్ 25 ) కేటాయించి పరిశోధనలకు, విద్యా బోధనకు కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసింది అని పేర్కొన్నారు.ల్యాండ్ ఆఫ్ ఇంటలెక్చువల్స్ గా ఖ్యాతి గడించి,ప్రపంచ స్థాయి శాస్త్రవేత్తలను అందించిన విశ్వవిద్యాలయంగా పేరుగాంచి ఇంటర్నేషనల్ అక్రిడిటేషన్లో 100 వ స్థానాన్ని, భారత్ అక్రిడిటేషన్లో 10 వ స్థానాన్ని పొందిందని,ఈ విశ్వ విద్యాలయానికి కేటాయించిన స్థలాన్ని కేవలం విద్యారంగ అభివృద్ధికి,పురోగతికి, పరిశోధనలకు మాత్రమే వినియోగించాలని ఇతరములకు కేటాయించ రాదని నాటి ప్రభుత్వ ఉత్తర్వులలో స్పష్టంగా పేర్కొన్నది అని తెలిపారు.ఇంత స్పష్టంగా ఆదేశా లిచ్చినా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జవహర్ నవోదయ స్కూల్ కు,ఏపీఎస్ఆర్టీసీ కి, స్పోర్ట్స్ అథారిటీకి, రంగారెడ్డి జిల్లా హెడ్ క్వార్టర్స్ కు,మండలరెవెన్యూ ఆఫీసుకు,స్టాటిస్టికల్ సెర్చ్ కు,ఏపీ ఎన్జీవోస్ కి అంటూ పలు విభాగాలకు 2004 వరకే 680 ఎకరాల భూమిని కేటాయింపులు చేశారన్నారు. ఇప్పుడు టీజీఐఐసి కి ఇచ్చిన 400 ఎకరాల భూమిని,వివిధ ప్రైవేట్ కంపెనీలకు కేటాయించా రన్నారు.ఈ భూమి మొత్తంగా యూనివర్సిటీ కాంపౌండ్ లోనే ఉందని దీనిని ప్రభుత్వ భూమి అనడం/ ప్రకటించడం ఏ మేరకు సమంజసం అని ధ్వజమెత్తారు.అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలు,విశ్వవిద్యాలయాల, విద్యాలయాల భూములను అన్యాక్రాంతం చేయడం ఆన వాయితీగా వస్తోంది. పర్యావరణాన్ని దెబ్బ తీయడమే కాకుండా,నగరాలకు ఆక్సిజన్ అందించే వృక్షాలను ధ్వంసం చేయడం,వీటితో మనుగడ సాగిస్తున్న పశు పక్ష్యాదులను అంత మొందించడం,జాతి నిర్మాణానికి ఉపయోగపడే, పరిశోధనలకు అవకాశం లేకుండా చేయడం విధ్వంసక చర్య అని పేర్కొన్నారు.కేవలం కాంక్రీట్ బిల్డింగులకు పరిమితం చేయడం అంటే విద్యా రంగాన్ని శాస్త్రీయత లేని యాంత్రీకరణ చేయడమే కాగలదని,విధ్వంసం ఎప్పటికీ అభివృద్ధి కాజాలదు అని పేర్కొన్నారు.చారిత్రాత్మక ఉస్మానియా యూనివర్సిటీకి 2400 ఎకరాల భూమిని కేటాయించగా ఇప్పుడు అది 1600 ఎకరాలకు పరిమితమైందని కాకతీయ విశ్వవిద్యాలయాన్ని 640 ఎకరాల భూమిలో స్థాపించగా అనేక అక్రమాలకు గురైంది అని అన్నారు.ఇటీవల అగ్రికల్చర్ యూనివర్సిటీలోని 100 ఎకరాల స్థలాన్ని హైకోర్టు నిర్మాణానికి కేటాయించారని అన్నారు.ప్రపంచ దేశాలలో యూనివర్సిటీలను ముందుచూపుతో (200 లేక 300 సంవత్సరాలు) భూములు కేటాయించి కాపాడుతుండగా తెలంగాణలో,దేశంలో మాత్రం తాత్కాలికంగా ఆలోచిస్తూ భూములను అన్యాక్రాంతం చేస్తున్నారు అని పేర్కొన్నారు.విద్యాలయాలు ఆధునిక దేవాలయాలని,దేశం పలు రంగాల్లో అభివృద్ధి సాధించడానికి ఇవి దోహదపడతాయని అని అన్నారు.భావి తరాలలో చైతన్యాన్ని, శాస్త్రీయ అవగాహనను పెంపొందించడానికి సుక్షితులైన బాధ్యతగల పౌరులుగా తీర్చి దిద్ద డానికి ఉపయోగపడే కేంద్రాలు విశ్వ విద్యాలయాలు అని పేర్కొన్నారు.ఇప్పటికే కాంట్రాక్టు ఉద్యోగులతో, అరకొర వసతులతో అల్లాడుతున్న విశ్వవిద్యాలయాలకు నిధులు కేటాయించి అభివృద్ధి చేయడం ఆపేసి,ప్రైవేట్ విశ్వవిద్యాలయాలకు భారీగా అనుమతులు మంజూరు చేస్తున్నారని వేలాదిమంది విద్యార్థుల జీవితాలతో చెల గాట మాడుతున్నారు అని ధ్వజమెత్తారు.వందలాదిమంది బోధన,బోధ నేతర సిబ్బంది మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నారని పచ్చని చెట్లు, పక్షుల కిలకిలా రాగాలను కనిపించ కుండా వినిపించకుండా,కుందేళ్లు దుప్పులు,అడవి పందుల పరుగులు వినపడకుండా, జలాశయాల ఉనికి లేకుండా చేస్తున్నారు అని పేర్కొన్నారు. బఫెల్లో లేక్,పీకాక్ లేకులు లేవంటున్నారు,అసలది అటవీ భూమి కాదని వాదిస్తున్నారన్నారు.బయో లైఫ్ ను రూపం లేకుండా చెరిపి వేస్తున్నారని పురాతన చరిత్రకు ఆనవాళ్లుగా మిగిలినమాష్రుమ్ రాక్స్ ప్రాంతాన్ని కార్పొరేటీకరణకు ధారా దత్తం చేస్తున్నారన్నారు.విద్యార్థుల నిరసనను పక్కదారి పట్టిస్తూ, మద్దతుగా నిలిచిన బుద్ధి జీవులు మేధావులపై రెచ్చ గొడుతున్నారనే అపవాదు మోపుతున్నారు అని,ప్రశ్నించడం అంటే ప్రజల కోసం,సత్యం కోసం,ప్రగతిశీల అభివృద్ధి కోసం నిలబడటమే అని సూచించారు.రెండున్నర దశాబ్దాల పాటు బోధన చేయడంతో ఆత్మీయ అనుబంధం పెనవేసుకున్న,పౌర హక్కుల నేత ప్రొఫెసర్ హరగోపాల్ వంటి పెద్దల అభిప్రాయాన్ని గౌరవించైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఎచ్ సియు భూముల కేటాయింపు ప్రక్రియను/ ఆలోచనను తక్షణం ఉపసంహరించు కోవాలన్నారు.ఈ విషయంలో విజ్ఞతతో నిర్ణయం తీసుకోవడం పాలకుల బాధ్యత అని ఈ ప్రత్యేక సందర్భంలో ఆపార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ తెలంగాణా ఆత్మ గౌరవ రక్షణ కోసం చొరవ చూపడం ఎంతైనాఅవసరం.ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు అక్కల బాపు,తెలంగాణ ప్రజా ఫ్రంట్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్,రైతు నాయకుడు బుర్రి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత సన్న బియ్యం

## పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి**

**పాలకుర్తి నవభూమి ఏప్రిల్ 01** జనగామ జిల్లా పాలకుర్తి మండలం శాతపురం గ్రామంలో ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ఉచిత సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత సన్న బియ్యం పథకాన్ని ఎమ్మెల్యే లబ్ధిదారులకు స్వయంగా అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ..ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు తీసుకువస్తున్నాం.అందులో భాగంగా, ఉచిత సన్న బియ్యం పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు నాణ్యమైన బియ్యాన్ని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వచ్చిందని తెలిపారు.రైతుల కష్టానికి గౌరవాన్ని కల్పించడంతో పాటు, పేద ప్రజలు ఆకలికి గురికాకుండా పోషకాహారాన్ని అందించడమే ఈ పథక ప్రధాన ఉద్దేశమని ఎమ్మెల్యే అన్నారు.ఈ పథక ఫలాలు ప్రతి అర్హత కుటుంబానికి చేరేలా తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ పథకం సజావుగా అమలవ్వాలని, బియ్యం పంపిణీ వ్యవస్థలో ఎలాంటి అక్రమాలను సహించేది లేదని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.ఈ పథకం విజయవంతంగా అమలుకావడానికి ప్రజలు భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే కోరారు.అనంతరం, ఎమ్మెల్యే గ్రామ ప్రజలతో మాట్లాడి, ప్రజా సమస్యలను ఆలకించి, పరిష్కారం కోసం సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పొట్టబత్తుల శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు పార్టీ గిరాగని కుమారస్వామి,పాలకుర్తి మాజీ సర్పంచ్ వీరమనేని యాకాంత రావు,కొడకండ్ల మార్కెట్ మాజీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవ రావు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కశిరబోయిన కృష్ణమూర్తి,రేషన్ డీలర్ ఏలూరి యాకన్న, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొందుగుల కొండయ్య,లోనే శ్రీనివాస్,పసులాది వెంకటేష్,ఐలమ్మ మార్కెట్ డైరెక్టర్ పసులాది చిన్న యాకన్న, ఓబీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి గణేష్ గౌడ్, ఎస్సి సెల్ అధ్యక్షులు గాదేపాక భాస్కర్, గోనె మైసిరెడ్డి,ఐలేష్ యాదవ్, పసులాది ప్రశాంత్, మాజీ ఎంపీపీ గడ్డం యాకసోమయ్య,గొళ్ళూరి సురేశ్,మహిళ నాయకురాలు బండిపెల్లి మణెమ్మ,కంజర్ల అన్నమయ్య, పసులాది ప్రశాంత్, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.





# రేపటి నుండి గ్రామాల్లో జై బాపు,జై బీమ్,జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమాలు

### కాటారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్ రెడ్డి



**కాటారం,ఏప్రిల్ 1 నవభూమి ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం లోని పలు గ్రామ పంచాయతీల్లో తేదీ. 03/04/2025 గురువారం నుండి తేదీ. 11/04/2025 శుక్రవారం వరకు జై బాపు,జై బీమ్,జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమాలు నిర్వహించబడుతాయని కాటారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేసాడు. తేది. 03/04/2025 గురువారం రోజున చింతకాని, ఇబ్రహీంపల్లె,బయ్యారం గ్రామాల్లో,తేది. 04/04/2025 శుక్రవారం రోజున అకూషాపూర్, కొత్తపల్లి,మేదిపల్లి,తేది. 05/05/2025 శనివారం రోజున చిదినపల్లి,ప్రతాపగిరి,నస్తూరుపల్లి,తేది. 07/04/2025 సోమవారం రోజున కాటారం, గారెపల్లి,మద్దులపల్లి,తేది. 08/04/2025 మంగళ వారం రోజున ఆదివారంపేట,గుమ్మల్లపల్లి, ఓడిపిలవంచ,తేది. 09/04/2025 బుధవారం రోజున వీరాపూర్,గూడూరు,గుండ్రాతుపల్లి, తేది. 10/04/2025 గురువారం రోజున దామెర కుంట,విలాసాగర్, గంగారం,తేది. 11/04/2025 శుక్రవారం చివరి రోజున దేవరాంపల్లి,శంకరాంపల్లి, ధన్వాడ గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించ బడునని తెలియజేసారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు,గ్రామ ప్రజలు,గ్రామ పెద్దలు అందరూ పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు.

# ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల బాధితులకు నష్టపరిహారం నిధులు విడుదల చెయ్యాలి

### ఏళ్లు గడుస్తున్నా బాధితులకు అందని నష్ట పరిహారం: తెలంగాణ మాల మహానాడు ములుగు జిల్లా అధ్యక్షులు జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు రాజమల్ల సుకుమార్



**మంగపేట,ఏప్రిల్ 01 (నవ భూమి):** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు పరిహారం చెల్లించడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యంతో బాధితులు ఇబ్బందులు పడుతున్నారనీ. వివిధ కేసులకు సంబంధించి ఫిర్యాదు దారులు కోర్టులకు హాజరయ్యేందుకు, ఇతరత్రా ఖర్చుల కోసం ప్రభుత్వపరంగా పరిహారం అందజేయాల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం 1989కు కేంద్ర ప్రభుత్వం 2016లో మరింత బలోపేతం చేసింది. ఈ చట్టం ప్రకారం బాధితులకు ప్రభుత్వపరంగా మూడు విడుతల్లో పరిహారం కింద చెల్లించాల్సి ఉంటుంది. ఈ సొమ్మును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాన వాటా కింద బాధితునికి అందజేయాలి. అట్రాసిటీ కేసుల్లో ఎఫ్ఐఆర్ (ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్) నమోదైన వెంటనే రూ. 25 శాతం, పోలీసులు కోర్టుల్లో చార్జ్‌షీట్ వేయగానే 50 శాతం, శిక్ష ఖరారైన తరువాత మరో 25 శాతం పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. అయితే చాలా కేసుల్లో ఎఫ్ఐఆర్ నమోదైన తరువాత 25 శాతం పరిహారం అందుతున్నప్పటికీ ఆ తరువాత చెల్లించాల్సిన వాయి దాలు అందడం లేదని బాధితులు వాపోతున్నారు. మరికొన్ని కేసుల్లో ఎఫ్ఐఆర్ నమోదైనా పరిహారం చెల్లించడం లేదని తెలుస్తోందనీ. అట్రాసిటీ కేసులకు సంబంధించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వారి వాటాను ఎప్పటికప్పుడు నిధులు విడుదల చేసి బాధితుల నష్టపరిహారం పెండింగ్‌లో ఉండకుండా నిధులను అందించవలసిందిగా సుకుమార్ కోరారు

## పాస్టర్ ప్రవీణ్ పగడాల దారుణ హత్యకు ప్రభుత్వాలు, చట్టాలు,

# అధికారులు,ప్రజలు స్పందించాలి

◆ **ఎన్‌సిసి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి సిస్టర్ అనంతోజు రక్షిత**



**పాలకుర్తి నవభూమి ఏప్రిల్ 01** జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కోలుకొండా గ్రామంలో ఇటీవలే పాస్టర్ ప్రవీణ్ పగడాల దారుణ హత్యకు ఎన్ సి సి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి సిస్టర్ అనంతోజు రక్షిత పాస్టర్ల సంగం ఆధ్వర్యంలో శాంతియుతంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి సిస్టర్ అనంతోజు రక్షిత మాట్లాడుతూ... ప్రవీణ్ పగడాలను ప్రీ ప్లాన్ గా హత్య చేసి ఈరోజు ఆక్సిడెంట్ గా చిత్రీకరిస్తున్నటువంటి పరిస్థితి మనం చూస్తూ ఉన్నాం,మంచి ఇంటలెక్చువల్ పర్సన్ ని తత్వ జ్ఞాని ప్రజాస్వామిక వాది అన్ని మత గ్రంథాలలో చక్కని ప్రావీణ్యం కలిగిన వ్యక్తి,క్రైస్తవ సమాజానికి ఒక బలమైనటువంటి ఆయుధం లాంటి వ్యక్తి ఒక శక్తి ,ఎంతోమంది అనాధలను చేరదీసి విధవరాళ్లను ప్రేమించి,ఎన్నో సామాజికమైన కార్యక్రమాలు చేస్తూ దైవికంగా ఎంతో డిబేట్స్ లో కానీ వ్యక్తిగతంగా కానీ చక్కని సమాచారము అందిస్తూ ఉన్న వ్యక్తి,మతోన్మాదుల చేతుల్లో హత్యకు గావించబడిన ప్రవీణ్ పగడాల మరణం క్రైస్తవ సమాజానికి మానవత్వానికి ఎంతో తీరని లోటు. మతోన్మాద శక్తులను విద్రోహశక్తులను వారి ఆగడాలను అరికట్టుటకు తెలంగాణ ఆంధ్ర ప్రభుత్వాలు కఠినమైనటువంటి చట్టాలను తీసుకొని రావాలని ఈ సందర్భంగా కోరుచున్నామన్నారు. తప్పకుండా ప్రవీణ్ పగడాలకు న్యాయం జరగాలని దాని వెనకాల ఉన్న కుట్ర దారులు ఎవరైతే ఉన్నారో వారిపై తప్పకుండా చర్యలు తీసుకొని, వారిని గుర్తించి తగిన గుణపాఠం చెప్పాల్సిందిగా కోరారు. ఈ భారత దేశంలో సర్వమత సమలితమైనటువంటి దేశము భారత రాజ్యాంగము గౌరవాన్ని నిలుపుకొనుటకు ప్రతి పౌరుడు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది మన దేశంలో ఉన్న చీడ పురుగులను ఎత్తి పారవేయాలని రాజకీయాల లబ్ధి కోసము కులమతాల చిచ్చు పెట్టడం ఎంతవరకు సమంజసం కాదని,హిందూ ముస్లిం క్రైస్తవులంతా కూడా భారత దేశ పౌరులని అందరికీ సమానమైనటువంటి హక్కు కలిగి ఉండాలి. మానవత్వాన్ని మంటగల్పకుండా మారణ హెూమానికి చోటు ఇవ్వకుండా తగిన చర్యలు సత్వరమే తీసుకొని మరెవరికి కూడా ఇలాంటి మారణ హెూమం సంభవించకుండా హత్య గావించబడకుండా ఉండు లాగున తగిన చర్యలు తీసుకొని ప్రజా గొంతుకగా ప్రభుత్వాలు ఉండాలని, ఈరోజు క్రైస్తవ సమాజం మీద పాస్టర్ల మీద చర్చిలా మీద జరుగుతున్న అమానుషమైనటువంటి దాడులను అరికట్టి తప్పక సమన్యాయ పరిపాలన జరిగించాలని తీవ్రంగా ఖండిస్తున్నాం, మా ర్యాలీలు ధర్నాలు శాంతియుతంగా మీరు న్యాయము చేకూర్చే అంతవరకు జరిగిస్తూనే ఉంటాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో యు ఈ పి ఎఫ్ పాస్టర్ ఎం. జాన్ పాల్,పాస్టర్ పి. ప్రభాకర్, పాస్టర్ యాకోబ్,ఇశ్రాయేల్, మత్తయి పాస్టర్,లాజరస్ పాస్టర్,ఆశీర్వాదం,మహేష్, మమత,పాల్ బన్నీ, యవనస్తులు,పిల్లలు పాల్గొన్నారు.

# రేణుకాకు రెడ్ ఫ్లాగ్ నివాళ్ళు

◆ **ఎంఎల్ పిఐ రెడ్ ఫ్లాగ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ**



**పాలకుర్తి నవభూమి ఏప్రిల్ 01** జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడివెండి,సీతారామపురం గ్రామంలో ఎంఎల్ పిఐ రెడ్ ఫ్లాగ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ అద్వర్యంలో కామ్రేడ్ రేణుకాకు ఘన నివాళ్ళర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..భారత సైన్యం ఏకపక్ష యుద్ధంలో నేలకొరిగిన అమరురాలు, మావోయిస్టు అగ్రనేత రేణుక అక్కకు ఎంఎల్ పిఐ(రెడ్ ఫ్లాగ్) ఘన నివాళిలర్పిచింది. బాధిత కుటుంబ సభ్యులకు తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రగాఢ సానుభూతి తెలియజేసింది. విద్యార్థి దశలోనే విప్లవాల బాటపట్టిన రేణుక తిరుపతి యూనివర్సిటీలో న్యాయ శాస్త్రం చదువుకుంది,విప్లవాల పురిటి గడ్డ కడివెండిలో పుట్టింది.

భూస్వామ్య అణచివేతకు గురైంది,విప్లవోద్యమంలో అంచలంచెలుగా ఎదిగింది,నల్లమల్లలో ప్రస్థానం ప్రారంభించి, దండకారణ్యం వరకు ఎగబాకింది. ఉన్నత విద్యావంతురాలు, కడు పేదరికం, గ్రామీణ ప్రాంత మహిళగా సమాజంలోని అష్ట కష్టాలను అర్థం చేసుకొని విప్లవద్యంలో చివరి శ్వాస వరకు నిలబడింది. అనేక పత్రికలకు సంపాదక వర్గంగా నిలిచింది,విప్లవ సాహితోద్యమంలో కథలు, కవితలు, విమర్శలు, వ్యాసాలు ఎన్నో రచించింది. విప్లవమే జీవితంగా కడవరకు పయనించింది. జీవితంలో ఎక్కడా రాజీధోరణీ వ్యవహరించ లేదు. అసమానతలు పోవాలని, కులాలు, మతాలను నిర్మూలన సాగాలని, భూస్వామ్య, పెట్టుబడిదారీ వ్యవస్థ నశించాలని ఎన్నో కలలు కంది. ఆ విప్లవ స్వప్నం కోసం తన జీవితాన్ని త్యాగం చేసింది. భారత సైన్యం తన ప్రజల మీద యుద్ధం చేస్తుంటే ఆ యుద్ధంలో హత్య గావించబడింది. ఆ యుద్ధ వీరురాలికి రెడ్ ఫ్లాగ్ ఘనంగా నివాళు లర్పిస్తుంది. ఆమె లక్ష్యం, ఆశయం, ఆశయాలు నెరవేరే వరకు పోరాడుతామని, అదే ఆమెకి ఇచ్చే నిజమైన నివ్వాలని రెడ్ ఫ్లాగ్ భావిస్తుంది. విప్లవాభివందనాలతో ఈకార్యక్రమంలో..దొంతి రాజేష్ కన్నా రాష్ట్ర కార్యదర్శి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సుధమల్ల భాస్కర్, మాన్యపు భుజేందర్, ఎండి కాసిం, సుధా, లింగస్వామి, ఎం అంజన్న, తెలంగాణ రాష్ట్ర కమిటీ ఎంఎల్ పిఐ(రెడ్ ఫ్లాగ్)

# మృతుని కుటుంబాన్ని పరామర్శించి,ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యే

**పాలకుర్తి నవభూమి ఏప్రిల్ 01** జనగామ జిల్లా కొడకండ్ల మండలం ఏడు నూతల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉప్పునూతల, మల్లయ్య అనారోగ్యంతో మరణించగ,పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశశ్వినిరెడ్డి,నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి మంగళవారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం మృతుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, మనోధైర్యం కల్పించి బాధిత కుటుంబానికీ పార్టీ అన్నివేళలా అండగా ఉంటుందని, భరోసా కల్పించినారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ ,మండల ముఖ్య నాయకులు ,సీనియర్ నాయకులు,సోషల్ మీడియా కోఆర్డినేటర్లు,గ్రామ కాంగ్రెస్ పార్టీ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ ప్రభుత్వం మాకు అండగా నిలిచింది

### జయశంకర్ భూపాలపల్లి జిల్లా ట్రాన్స్ జెండర్ల అధ్యక్షురాలు ఏ.రూప



**కాటారం,ఏప్రిల్ 1 నవభూమి ప్రతినిధి:**బీఆర్ఎస్ శాసనసభ్యులు ఇటీవల జరిగిన శాసన సభలో చేసిన వెకిలి చేష్టలకు ట్రాన్స్ జెండర్స్ మంగళ వారం రోజున నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా భూపాలపల్లి జిల్లా ట్రాన్స్ జెండర్స్ అధ్యక్షురాలు ఏ.రూప మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం మా ట్రాన్స్ జెండర్స్ ను పట్టించుకోలేదు,కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాకు అనేక ఉపాధి అవకాశాలు కల్పిస్తూ సమాజంలో గౌరవంగా బతికేందుకు సహాయ పడుతున్నారని,మాకు హైదరాబాద్ సిటీలో ట్రాఫిక్ అసిస్టెంట్స్ గా ఉద్యోగ అవకాశాలు కల్పించారని అన్నారు.అలాగే మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం అనేక విధాలుగా మాకు సహాయ పడుతున్న విషయాలను మంత్రి శ్రీధర్ బాబు మా ట్రాన్స్ జెండర్ విషయం ప్రస్తావన తీసుకు వచ్చినప్పుడు బిఆర్ఎస్ శాసనసభ్యులు వెకిలి చేష్టలు చేస్తూ నవ్వడం,మా యొక్క మనో భావాలను దెబ్బతీసాయని అని అన్నారు. బిఆర్ఎస్ శాసనసభ్యులు తక్షణమే ట్రాన్స్ జెండర్స్ కు బే శరత్ గా క్షమాపణలు చెప్పాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేపడతామని ట్రాన్స్ జెండర్ ల భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలు రూప తెలిపారు.ఈ కార్యక్రమంలో శాన్విత,ఫ్రూటీ, నిత్య,శానిష్ఠ,రస్నా,వారోడిని తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ యువ వికాసం పథకం గడువు పెంపు




**కాటారం,ఏప్రిల్ 1 నవభూమి ప్రతినిధి:**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం గడువును తేదీ. 05/04/2025 నుండి తేదీ.14/04/2025 వరకు పొడిగించడం జరిగిందని,ఇట్టి అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కాటారం ఎంపిడిఓ అడ్డూరి బాబు తెలిపాడు.రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాల మేరకు కాటారం మండలం లోని ఆసక్తి గల నిరుద్యోగ యువతి,యువకులు రాజీవ్ యువ వికాసం పథకం కొరకు తేది.14/04/2025 లోపు దరఖాస్తులను ఆన్లైన్లో సమర్పించి,ఆ దరఖాస్తు ప్రింటును బెనిఫిషరీ పాస్ ఫోటో,ఇతర ధ్రువ పత్రాలు జత పరిచి,ఇట్టి దరఖాస్తులను మండల ప్రజా పరిషత్ కార్యాలయం లోని ప్రజా పాలన సేవా కేంద్రం నందు కార్యాలయ పని వేళలలో సమర్పించ గలరని కాటారం ఎంపిడిఓ అడ్డూరి బాబు ఒక ప్రకటనలో తెలియజేసాడు.

# కుల గణన నిధులు విడుదల చేయాలని కలెక్టర్‌కు లేఖ

**నల్లబెల్లి-నవభూమి :** కులగణన గౌరవ వేతనం నిధులు విడుదల చేయాలని తెలంగాణ ఉద్యమకారుడు, దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య వరంగల్ జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. ఈ మేరకు నల్లబెల్లి మండల కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ ద్వారా తన లేఖను జిల్లా కలెక్టర్ కు పంపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కుల గణన సర్వేలో పాల్గొన్న ప్రభుత్వ అధికారులైన సూపర్‌వైజర్లకు రూ.12000, ఎనెమ్యురేటర్లకు రూ.10 వేలు, ప్రభుత్వ కంప్యూటర్ ఆపరేటర్లకు ఒక్కో ఫామ్ ఆన్‌లైన్ చేస్తే రూ.15, ప్రైవేట్ కంప్యూటర్ ఆపరేటర్లకు రూ.30 చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు.

# సన్న బియ్యం పంపిణీ చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం

### సన్న బియ్యం ఇస్తున్న తొలి రాష్ట్రంగా తెలంగాణ చరిత్రలో నిలిచిపోతుంది

### మంగపేట మండలం కాంగ్రెస్ పార్టీ ఎస్సి సెల్ ప్రధానకార్యదర్శి గాజర్ల రాజు



**మంగపేట,ఏప్రిల్ 01(నవభూమి):** మంగపేట మండల ఎస్సి సెల్ ప్రధాన కార్యదర్శి గాజర్ల రాజు మాట్లడుతూ రాష్ట్రంలోని ప్రతి పేదవారి కుటుంబానికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం అని, సన్నబియ్యం ఇవ్వాలన్న దృక్పథంతో ప్రజాపాలన ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం. ఉగాది పండగ కానుకగా తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు, దనసరి అనసూయ సీతక్క, మంత్రి మండలి ఆధ్వర్యంలో అందిస్తున్న కానుక అని అన్నారు. చారిత్రాత్మకంగా సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించడం రేపు సీతక్క చేతుల మీదుగా జరుగుతుందని అన్నారు. సన్న బియ్యం పంపిణీ పథకం ద్వారా రాష్ట్రంలోని 80%పైగా పేదవారికి ప్రజానీకానికి లబ్ధి చేకురుతుందని అన్నారు దేశంలోనే సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టిన తొలి రాష్ట్రంగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్రలో నిలుస్తుందని తెలియజేశారు.ఈ పథకాన్ని ప్రవేశపెట్టిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డికి పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి పంచాయతీరాజ్ శాఖ మంత్రి మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క కి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేసినారు.10 సంవత్సరాల లో పిడిఎఫ్ బియ్యాన్ని మిల్లర్లు రీసైకిలింగ్ చేసి కోట్ల రూపాయలు సంపాదించారని వాటికి చెక్ పెట్టడానికే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదవారి కడుపు నింపాలనే లక్ష్యంతో సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించిందని అన్నారు.సన్న బియ్యం పంపిణీ పథకం తెలంగాణ రాష్ట్రంలో ఎప్పటికీ ఉంటుందని, అలాగే ప్రజల గుండెల్లో కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ చిర స్థాయిలో నిలిచిపోతుందని తెలిపారు.

# వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు చేదు అనుభవం

**వర్ధన్నపేట నవభూమి :** సన్న బియ్యం పంపిణీ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు చేదు అనుభవం ఎదురైంది. ఆకేరు వాగు నుండి ఇసుకను తరలించకుండా పోలీసులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ ఇసుక కూలీలు, ట్రాక్టర్ డ్రైవర్లు ఇల్లంద గ్రామంలోని జాతీయ రహదారిపై ఎమ్మెల్యే నాగరాజును అడ్డుకున్నారు. తాము ఉపాధి కోల్పోయిన కూడా ఎమ్మెల్యే పట్టించుకోవడంలేదని కూలీలు నిరసన తెలిపారు.సుమారు రెండు గంటలపాటు జాతీయ రహదారిపై రాస్తారోకో చేయడంతో ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఎమ్మెల్యే అక్కడికి రావడంతో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆత్మహత్య చేసుకుంటామని కూలీలు ఆందోళన చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడకుండా వెళ్లిపోవడం పట్ల కూలీలు తీవ్ర అసహనానికి గురయ్యారు. పోలీసులు ఆందోళనకారులకు నచ్చచెప్పి పక్కకు పంపించడానికి నానా ఇబ్బందులు పడ్డారు.బయటపడ్డ వర్గ పోరు..కాంగ్రెస్‌లో వర్గ పోరు ఒక్కసారిగా బయటపడింది. ఒక వర్గానికి చెందిన కార్యకర్తలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం పట్ల స్థానికంగా ఉండే కొంతమంది కాంగ్రెస్ నాయకులు దీనిని తప్పుపట్టారు. ఈ విషయంపై ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు జోక్యం చేసుకొని పంపించారు. కాగా, పోలీసుల పట్ల కూడా కాంగ్రెస్ కార్యకర్తలు దురుసుగా ప్రవర్తించడం స్థానికులను విస్మయానికి గురిచేసింది.



# సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**రాయపర్తి నవభూమి :** రాష్ట్రంలోని నిరుపేదలందరి సంక్షేమ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన సాగిస్తున్నదని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి తో కలిసి ఆమె మండల కేంద్రంలోని రేషన్ దుకాణంలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సన్న బియ్యం పంపిణీ తో పేదల ఆకలి బాధలు తీర్చడంతోపాటు ఆత్మస్థైర్యం మెరుగవుతుందన్నారు.అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన 21 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. రాజీవ్ యువ వికాసం పథకాన్ని నిరుద్యోగులు అందరూ వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ముల్కనూరి శ్రీనివాస్, ఎంపీడీవో గుగులోతు కిషన్ నాయక్, డిప్యూటీ తహసిల్దార్ గంకిడి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీఓ కూచన ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి వల్లే వినోద్ కుమార్, నాయకులు జాటోతు హామ్య నాయక్, బిల్ల సుధీర్ రెడ్డి, ఈదులకంటి రవీందర్ రెడ్డి, సరికొండ కృష్ణారెడ్డి, పెండ్లి మహేందర్ రెడ్డి, ఊగ మునిత, కాంచనపల్లి వనజా రాణి, ఇల్లందుల భగవాన్, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి శవయాత్ర.. కేయూలో ఉద్రిక్తత

**హనుమకొండ-నవభూమి :** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల అక్రమ అరెస్టులను ఖండిస్తూ మంగళవారం కాకతీయ యూనివర్సిటీలో బీఆర్ఎస్వీ, పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్, వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి శవయాత్ర నిర్వహించారు. డప్పు చెప్పులతో కేయూ మొదటి గేటు వరకు శివయాత్ర నిర్వహించి దిష్టిబొమ్మ దహనానికి యత్నించగా కేయూ పోలీసులు వారిని అడ్డుకున్నారు. రోడ్డుపై బైఠాయించి రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.విద్యార్థి సంఘాల నాయకులకు, పోలీసుల మధ్య వాగ్వాదంతో కేయూలో ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ కేయూ ఇంచార్జి జెట్టి రాజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను 400 ఎకరాలను వేలం వేసి ఇతర ప్రైవేట్ కార్పొరేటు కంపెనీలకు అప్పచెప్పే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.విద్యార్థులు మా భూములు మాకు కావాలనీ శాంతియుతంగా ధర్నాలు చేస్తుంటే రేవంత్‌రెడ్డి విద్యార్థులపైన అక్రమంగా లాఠీచార్జి చేపిస్తూ వారిని అరెస్టులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి తీరు మానుకొని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులకు క్షమాపణలు చెప్పి ఆ భూముల జోలికి వెళ్లకుండా ఉండాలని లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని యూనివర్సిటీల్లో పెద్దఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

